### ట్రాఫిక్ నియంత్రణకు అన్ని శాఖలు సహకరించాలి: సీపీ

రాంనగర్, ఆగస్టు 14 : కరీంనగర్‌లో ట్రాఫిక్ నియంత్రణ కోసం అన్ని శాఖలు సహకరించాలని సీపీ అభిషేక్ మొహంతి సూచించారు. కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం పలు శాఖల అధికారులతో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రతా చర్యలపై సీపీ సమన్వయ సమావేశం నిర్వహించారు. స్మార్ట్ సిటీ అభివృద్ధిలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరుపై చర్చించారు. నగరంలో అవసరమైన చోట్ల మాత్రమే యూటర్న్‌లు, సోలార్ లైట్లను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బైపాస్ రోడ్డు మొత్తం లైటింగ్ ఉండేలా చూడాలన్నారు. శాఖల వారీగా పెండింగ్ పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, మున్సిపల్, ఫైర్, ఆర్‌అండ్‌బీ, హెచ్‌కేఆర్, ట్రాన్స్‌పోర్ట్‌శాఖ, ఆర్‌టీసీ, స్మార్ట్ సిటీకి చెందిన ఎంఎస్ఐ సంస్థల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

### దేశభక్తిని నింపిన తిరంగా సైకిల్ ర్యాలీ

తిరంగా సైక్లింగ్ ర్యాలీని ప్రారంభిస్తున్న అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా. వీ నరేందర్ రెడ్డి, సైక్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

కొత్తపల్లి, ఆగస్టు 14 : జిల్లా సైక్లింగ్ అసోసియేషన్, అల్ఫోర్స్ విద్యా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన తిరంగా సైకిల్ ర్యాలీ ఉత్సాహంగా సాగింది. స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్ట్ మైదానంలో ర్యాలీని కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్, అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా. వీ నరేందర్‌రెడ్డి జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. బీ మధుసూదన్‌రెడ్డితో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. పాఠశాల నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీ కోర్టు చౌరస్తా మీదుగా ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి తెలంగాణ చౌక్ వరకు కొనసాగగా, విద్యార్థులు జాతీయ సమైక్యతను చాటే నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురభి వేణుగోపాల్, సభ్యులు ఎం. అరవింద్‌బాబు, కోచ్‌లు, క్రీడాకారులు, నగరవాసులు పాల్గొన్నారు.

### *వింధ్యావ్యాలీ పాఠశాల ఆధ్వర్యంలో..*

కొత్తపల్లి, ఆగస్టు 14 : జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావ్యాలీ విద్యార్థులు బుధవారం తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ముందుగా ర్యాలీని పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాశ్ రావు జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు జాతీయ జెండాలను ధరించి వీధుల్లో ర్యాలీగా వెళ్లి జాతీయ భావాన్ని చాటిచెప్పారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ రామవరం పృథ్వీరావు, ప్రిన్సిపాల్ జి. ప్రశాంత్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

### మెరుగైన వైద్యసేవలందించాలి: అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

తిమ్మాపూర్, ఆగస్టు 14: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ వైద్యులు, సిబ్బందికి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. గ్రామీణ ప్రజలు ప్రభుత్వ వైద్యసేవల్ని వినియోగించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీవో విజయ్‌కుమార్, వైద్యాధికారి ప్రణవ్, రామ్మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యతోనే ఉజ్వల భవిత: అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

మానకొండూర్, ఆగస్టు 14: విద్యతోనే ఉజ్వల భవిత ఉంటుందని కరీంనగర్ అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ అన్నారు. బుధవారం స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ కరీంనగర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై క్లబ్‌సభ్యులు వితరణ చేసిన నోట్‌బుక్స్, పండ్లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి, చీఫ్ కోఆర్డినేటర్ కెప్టెన్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, సభ్యులు సత్యనారాయణరావు, సరళ, కిరణ్, మధు మోహన్, సుమన్, లక్ష్మారెడ్డి, మనోహర్, ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎం, ఉపాధ్యాయులున్నారు.

### పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలి

గంగాధర, ఆగస్టు 14: పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రధానోపాధ్యాయుడు ఏనుగు ప్రభాకర్‌రావు సూచించారు. ఒద్యారం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, గడ్డి అధికంగా పెరుగడంతో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు పాలోజు రవీందర్ గడ్డి మందును పిచికారీ చేశారు. ఇంటి నుంచి స్ప్రే మిషన్ తీసుకువచ్చి గడ్డి మందును పిచికారీ చేసిన రవీందర్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# గురుకులంలో వసతులు ఎలా ఉన్నాయి..

- విద్యార్థినులను ఆరా తీసిన కలెక్టర్ పమేలా, ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, ఆగస్టు 14: హాస్టల్‌లో వసతులు ఎలా ఉన్నాయి..? ఉపాధ్యాయులు బాగా చూసుకుంటున్నారా..? అంటూ తిమ్మాపూర్ మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులను కలెక్టర్ పమేలా సత్పతి ఆరా తీశారు. బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ఆమె గురుకులాన్ని సందర్శించారు. పాఠశాల ఆవరణ అంతా కలియదిరిగారు. వంటలను పరిశీలించారు. అలాగే విద్యార్థులతో కలిసి కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు భోజనం చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, పలు శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో కలిసిభోజనం చేస్తున్న కలెక్టర్

***మానకొండూర్ పీహెచ్‌సీ, స్కూల్ సందర్శన***

మానకొండూర్, ఆగస్టు 14: మానకొండూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు బాలుర ఉన్నత పాఠశాలను కలెక్టర్ పమేలా సత్పతి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి సందర్శించారు. గ్రామాల నుంచి పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని కలెక్టర్ పమేలా సత్పతి వైద్యసిబ్బందిని ఆదేశించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులు వండుతున్న భోజనాన్ని కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, మండల ప్రత్యేకాధికారి శ్రీధర్, తహసీల్దార్ రాజేశ్వరి, వైద్యాధికారి డాక్టర్ సౌమ్య, సీహెచ్‌వో రాజూనాయక్, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

***స్వాతంత్ర్య వేడుకల ఏర్పాట్ల పరిశీలన***

కరీంనగర్, ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ) : స్వాతంత్ర్య వేడుకలకు కరీంనగర్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. బుధవారం రాత్రి కలెక్టర్ పమేలా సత్పతి ఏర్పాట్లను పరిశీలించారు. గురువారం జరిగే ఈ వేడుకల్లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఉదయం 9.02 గంటలకు జెండా ఆవిష్కరణ, 9.10 గంటలకు వందన స్వీకారం, 9.25 గంటలకు మంత్రి శ్రీధర్ బాబు సందేశం, 9.30 గంటలకు స్వాతంత్ర్య సమరయోధులకు సత్కారం, 10.45 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, 11.45 గంటలకు వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి ప్రశంసా పత్రాలు, మెమొంటోల ప్రదానం, 11.30 వరకు వివిధ శాఖల స్టాల్స్ పరిశీలన కార్యక్రమాలు ఉంటాయి.

### అభాగ్యులకు అండగా కేసీఆర్: ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

మామిడాలపల్లిలో ఇంటింటికీ వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, ఆగస్టు 14: అనారోగ్యానికి గురై మెరుగైన వైద్యం చేయించుకోలేని అభాగ్యులకు అండగా నిలిచిన గొప్ప నాయకుడు తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కొనియాడారు. వీణవంక మండలం మామిడాలపల్లి, ఇప్పలపల్లి, చల్లూరు, కిష్టంపేట, లస్కుక్కపల్లి, నర్సింగాపూర్, వల్భాపూర్, బేతిగల్, కనపర్తి గ్రామాల్లోని 53మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి-శాలినీరెడ్డి దంపతులు బుధవారం స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. అనారోగ్యానికి ఏ ఒక్కరూ కూడా అధైర్య పడొద్దని.. ఏ ఆపదవచ్చినా తాను ఉండగా ఉంటానని భరోసానిచ్చారు. అలాగే చల్లూరు గ్రామంలో పద్మ-విజయ్‌కుమార్ దంపతులు దళితబంధు ద్వారా ఏర్పాటు చేసుకున్న దయ డిజిటల్ ఫ్లెక్సీ ప్రింటింగ్ ప్రెస్‌ను సందర్శించారు. దళితబంధు లబ్ధిదారులకు రెండో విడుత డబ్బులు అందజేసి వారి అభివృద్ధికి తోడ్పడాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం కోర్కల్, వీణవంకలో పలు శుభకార్యాలకు హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బాలకిషన్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచులు బండ సుజాత, బండారి ముత్తయ్య, పొదిల జ్యోతి-రమేశ్, మోరె సారయ్య, పోతుల నర్సయ్య, రమేశ్, మాజీ ఎంపీటీసీలు మూల రజిత-పుల్లారెడ్డి, ఎలవేన సవిత-మల్లయ్య, కామిడి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, శంకర్, సత్యనారాయణ, కిషన్‌రెడ్డి, మధు, సుధాకర్, తిరుపతి, సమ్మిరెడ్డి, బొంగోని రాజయ్య పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలి

విద్యానగర్, ఆగస్టు 14: జిల్లాలో సీజనల్ వ్యాధుల వ్యాప్తి అరికట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నత స్థాయి అధికారులతో కలిసి వివిధ ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ పమేలా సత్పతి వీసీలో పాల్గొన్నారు. వసతి గృహాల స్థితిగతులు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమ అమలు వంటి పలు అంశాలపై సీఎస్ సుదీర్ఘంగా సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తోపాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్‌వో పవన్ కుమార్, డీఆర్‌డీవో శ్రీధర్, జిల్లా వైద్యాధికారి సుజాత, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి

శంకరపట్నం, ఆగస్టు 14 : మెరుగైన విద్యుత్ సరఫరాకు ఎన్‌పీడీసీఎల్ కృషి చేస్తున్నట్లు ఎన్‌పీడీసీఎల్ చైర్‌పర్సన్ ఎన్‌వీ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆముదాలపల్లి గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో బుధవారం ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికకు ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మార్చాలని కోరుతూ రెండు, పేరు మార్పులపై రెండు దరఖాస్తులు వచ్చినట్లు ఏఈ కుమారస్వామి వెల్లడించారు. కాగా, ఆముదాలపల్లి గ్రామంలో నివాస గృహాలు నిర్మిస్తున్న స్థలం సమీపంలో ఓ రైస్‌మిల్లు నిర్మాణం కోసం ప్రయత్నాలు జరుగుతున్నందున నిర్మాణానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వవద్దని కొందరు ఫిర్యాదు పత్రం ఇవ్వగా అధికారులు స్వీకరించలేదు. తాము పంచాయతీ అధికారి ఎన్‌వోసీ ఆధారంగా మాత్రమే విద్యుత్ కనెక్షన్‌లు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్థిక వ్యవహారాల సభ్యులు చవన్‌దాస్, నరేందర్, ఏఈలు కుమారస్వామి, ఆర్ సంపత్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, బీ శ్రీనివాస్, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్య రాజకీయ కమిటీ చైర్మన్‌గా శ్రీధర్

తెలంగాణచౌక్, ఆగస్టు 14: జిల్లా ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ చైర్మన్‌గా శ్రీరామిడి శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు నగరంలోని ఆర్యవైశ్య సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ జిల్లా కమిటీ సభ్యుల సమక్షంలో శ్రీధర్‌కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ, తన మీద విశ్వాసంతో రాజకీయ కమిటీ చైర్మన్‌గా నియమించిన జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ, సహకరించిన యువజన విభాగం అధ్యక్షుడు సాయికృష్ణ, నాయకులు వెంకటేశం, మునీందర్, నవీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజనీప్రసాద్, విశ్వనాథం పాల్గొన్నారు. కాగా, రాజకీయ కమిటీ చైర్మన్ నియమితులైన శ్రీధర్‌కు పలువురు ఆర్యవైశ్య నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

### కాపురానికి తీసుకెళ్లాలని ధర్నా

శంకరపట్నం, ఆగస్టు 14 : తనకు మాయమాటలు చెప్పి పెళ్లి చేసుకుని, మోజు తీరాక వదిలేశాడని ఓ మహిళ మొలంగూర్ గ్రామంలో రెండో భర్త ఇంటి ఎదుట ధర్నాకు దిగింది. ధర్నాకు దిగిన సౌమ్యశ్రీ కథనం ప్రకారం.. 2018లో చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడితో సౌమ్యశ్రీకి పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు కలిగారు. కాలక్రమంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చి గొడవలకు దారి తీశాయి. ఈ నేపథ్యంలో సౌమ్యశ్రీ కొంతకాలంగా పిల్లలతో కలిసి భర్తకు దూరంగా వచ్చి తల్లిగారి ఇల్లైన మొలంగూర్‌లో ఉంటున్నది. ఈ క్రమంలో ఆ గ్రామానికే చెందిన భూపేశ్ అనే యువకుడు ప్రేమిస్తున్నానంటూ వెంట పడ్డాడు. పెళ్లి చేసుకుంటానని, తన పిల్లల బాధ్యత కూడా తీసుకుంటానని నమ్మబలకడంతో హైదరాబాద్‌లోని ఓ గుడిలో వివాహం చేసుకున్నారు. కాపురం మొదలు పెట్టి నాలుగు నెలలు కాగానే ఇప్పుడు తమను వదిలి వచ్చాడని సౌమ్యశ్రీ తెలిపింది. తనకు న్యాయం చేయాలని భూపేశ్ ఇంటి ఎదుట ధర్నాకు దిగింది. పోలీసులు సమాచారం తెలుసుకుని ఘటనా స్థలానికి వచ్చారు. రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రవి ఇద్దరికి కౌన్సెలింగ్ నిర్వహించారు.

## జిల్లాలో కొత్తగా పది జీపీలు

- ఏర్పాటుపై త్వరలోనే షెడ్యూల్

కరీంనగర్ ఆగస్టు 14 (నమస్తే తెలంగాణ): కరీంనగర్ జిల్లాలో కొత్తగా పది గ్రామ పంచాయతీలు ఏర్పడబోతున్నాయి. ప్రస్తుత గ్రామ పంచాయతీలకు దూరంగా ఉండి, 500జనాభా ఉంటే ప్రత్యేక జీపీలుగా గుర్తించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2016లోనే అనేక తండాలు, శివారు గ్రామాలను పంచాయతీలుగా గుర్తించారు. అప్పట్లో వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం ప్రత్యేక పంచాయతీల ఏర్పాటుకు అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి, గెజిట్ పబ్లికేషన్ సైతం చేసింది. అయితే ఈ ప్రతిపాదనలు గవర్నర్ వద్ద నిలిచిపోయాయి. ఇప్పుడు ఆమోదం తెలుపడంతో కొత్త పంచాయతీల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ప్రస్తుతం జిల్లాలో 313 పంచాయతీలు ఉన్నాయి. కొత్తగా పది కలిపితే మొత్తం గ్రామ పంచాయతీల సంఖ్య 323కి చేరుకోనున్నాయి. పాత పంచాయతీలతో కలిపి కొత్త పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనుండగా, ఈ లోగా గ్రామాల మధ్య సరిహద్దులను రెవెన్యూ అధికారులు ఖరారు చేయనున్నారు.

***కొత్త పంచాయతీలివే..***

సైదాపూర్ మండలంలో గొల్లగూడెం, కురుమపల్లి, గర్రెపల్లిని, హుజూరాబాద్ మండలంలో కందుగుల పరిధిలోని అంబేద్కర్‌నగర్‌ను, శంకరపట్నం మండలంలో గుడాటిపల్లి, నల్లవెంకయపల్లి, గద్దపాక పరిధిలోని అంబేద్కర్‌నగర్‌ను జీపీలుగా గుర్తించనున్నారు. అలాగే మానకొండూర్ మండలంలో రాఘవాపూర్, బంజెరుపల్లిని, గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి ఎక్స్‌రోడ్‌ను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయనున్నారు.

### దేవాదాయశాఖ ఏసీగా సుప్రియ బాధ్యతలు

కమాన్‌చౌరస్తా/కొత్తపల్లి, ఆగస్టు 14 : ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్‌గా నాయిని సుప్రియ బుధవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. గతంతో ఇక్కడ విధులు నిర్వహించిన ఏసీ, ప్రస్తుత మెదక్ జిల్లా ఏసీ ఆకునూరి చంద్రశేఖర్ నుంచి ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయిని సుప్రియను కార్యాలయంలో టీఎన్‌జీవో నాయకులు, దేవాదాయ శాఖ సిబ్బంది కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగుల అనిల్ కుమార్, కార్యదర్శి రాగి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు హర్మీందర్ సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పాము సత్యనారాయణ, ఈవోలు ఉన్నారు.

### కరీంనగర్ దవాఖానలో వైద్యుల నిరసన

విద్యానగర్, ఆగస్టు 14: కోల్‌కతాలో వైద్యురాలి హత్య ఘటనపై బుధవారం కరీంనగర్‌లోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డాక్టర్లకు రక్షణ కల్పించేలా చట్టం రూపొందించాలని కోరారు. నిరసనలో ప్రభుత్వ వైద్యులు పాల్గొన్నారు.

### బీబీఏ విద్యార్థుల పోస్టర్ల తయారీ

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 14 : జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలోని బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన వస్తువుల పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యాంసాని సత్యనారాయణ ప్రారంభించారు. నూతన పద్ధతులు, నూతన వస్తువుల ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని బీబీఏ విద్యార్థులకు సూచించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నితిన్, కళాశాల కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధిపతి టి. రాజయ్య, కార్యక్రమ సమన్వయకర్త హర్ జ్యోత్ కౌర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పురుగుల మందు పిచికారీ.. అస్వస్థతతో రైతు మృతి

సైదాపూర్, ఆగస్టు 14: మండలకేంద్రానికి చెందిన రైతు గూళ్ల శ్రీనివాస్(45) తీవ్ర అస్వస్థతతో మృతిచెందాడు. గ్రామశివారులోని వ్యవసాయభూమి వద్ద పత్తిచేనుకు పురుగుల మందు పిచికారీ చేస్తుండగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు.

### నోటింగ్, డ్రాఫ్టింగ్‌పై ఉద్యోగులకు శిక్షణ

కలెక్టరేట్, ఆగస్టు 14 : జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు నోటింగ్, డ్రాఫ్టింగ్‌పై నిర్వహిస్తున్న శిక్షణ బుధవారం నాటితో ముగిసింది. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థ ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ శిక్షణలో సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టులకు నోటింగ్ అండ్ డ్రాఫ్టింగ్ (ఎంఎస్ఆఫీస్)పై మాస్టర్ ట్రైనర్లతో అవగాహన కల్పించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జగిత్యాల నుంచి 10 మంది, పెద్దపల్లి నుంచి 10 , కరీంనగర్ నుంచి 10 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో పాల్గొన్న రీజినల్ ట్రైనింగ్ మేనేజర్ ఎస్. నాగార్జున మాట్లాడుతూ, ఈ శిక్షణ వల్ల ఉద్యోగులు వ్యక్తిగత నైపుణ్యం పెంపొందించుకోవచ్చని, కంప్యూటర్‌పై అవగాహన కలుగుతుందన్నారు.

### అన్నారంలో రేషన్ బియ్యం పట్టివేత

మానకొండూర్ రూరల్, ఆగస్టు 14: పోచంపల్లి నుంచి సిరిసిల్ల వైపు టాటాఏస్‌లో అక్రమంగా తరలిస్తున్న దాదాపు 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అన్నారం గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న అరవింద్ అలియాస్ సిద్దూ, వంశీకృష్ణ, అంగిడి శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు మానకొండూర్ సీఐ సదన్ కుమార్ తెలిపారు.

### కుక్కదాడిలో ముగ్గురికి గాయాలు

వీణవంక, ఆగస్టు 14: ఘన్ముక్ల గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులపై కుక్కదాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. ఘన్ముక్ల గ్రామానికి చెందిన లత (10), ఊట్ల రిషి (10), ఓరుగంటి నాగప్రణవ్ (13) ఇంటి వద్ద ఉండగా బుధవారం రాత్రి 8 గంటల సమయంలో కుక్క దాడి చేయగా, తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికంగా ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానకు 108 వాహనంలో తరలించారు.

### విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు

తిమ్మాపూర్, ఆగస్టు 14: ఎల్ఎండీ కాలనీలోని మానసిక వికలాంగుల పాఠశాలకు చెందిన 100మంది విద్యార్థులకు పాక యాదగిరి, చుంచు రామలక్ష్మి కుటుంబసభ్యులు ఉచిత బస్‌పాస్‌లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారికి, ఆర్టీసీ యాజమాన్యానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీశ్, ఏవో బాలరాజు, ఆర్టీసీ కోఆర్డినేటర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

### 'వాహనదారుడిపై టోల్‌గేట్ సిబ్బంది దాడి'

తిమ్మాపూర్ రూరల్, ఆగస్టు 14: ఫాస్ట్ ట్యాగ్ స్కానర్ సరిగ్గా పనిచేయడం లేదని అడిగినందుకు కారులో ఉన్న వాహనదారుడిపై టోల్‌గేట్ సిబ్బంది దాడి చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. చింతల వెంకటయ్య కథనం ప్రకారం.. వెంకటయ్య తన అల్లుడు గడ్డం మనోజ్, అతడి మిత్రులతో కలిసి సిద్దిపేట నుంచి కరీంనగర్ బయలుదేరారు. ఈ క్రమంలో రేణికుంట టోల్‌గేట్ వద్ద ఫాస్టాగ్‌లో బ్యాలెన్స్ ఉన్నప్పటికీ స్కానర్ సరిగా పని చేయడం లేదని అడిగినందుకు సిబ్బంది తన అల్లుడు మనోజ్‌ను తీవ్రంగా గాయపరిచి మెడలో ఉన్న గోల్డ్ చైన్‌ను అపహరించారని వెంకటయ్య చెప్పారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

### పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తాం: కేంద్ర సహాయ మంత్రి బండి

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 14 : జిల్లాలోని శ్రీ సరస్వతీ శిశుమందిరాల అభివృద్ధికి సహకరిస్తానని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. శ్రీ సరస్వతీ విద్యాపీఠం పాలకమండలి సభ్యులు బుధవారం ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ, కరీంనగర్ శ్రీ సరస్వతీ శిశుమందిర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా 10 పాఠశాలలను సీబీఎస్ఈ నామ్స్ ప్రకారం ఇంటర్నేషన్ పాఠశాలల అభివృద్ధి చేసేందుకు సహకరిస్తామని చెప్పారు. ఇక్కడ శ్రీ సరస్వతీ విద్యాపీఠం పాలకమండలి సభ్యులు ఎలగందుల సత్యనారాయణ, పాఠశాల కార్యదర్శి ఇంజినీర్ కోల అన్నారెడ్డి, పాఠశాల సహకార్యదర్శి కొండా గంగాధర్, సభ్యులు తాటి రాజేశ్వర్‌రావు, ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి ఉన్నారు.

### గ్రామ అభివృద్ధికి సహకరించాలి: ఎమ్మెల్య